## మోడల్ స్కూల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్



మంత్రాలయం,శివసూర్య, జూలై 6: మంత్రాలయం మండలం రచ్చమర్రి మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ . అశోక్ నాయక్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు మంగళవారం 07/07/2026 నాడు పదో తరగతి మార్కులతో నేరుగా పాఠశాలకు వచ్చి ప్రిన్సిపల్‌ను సంప్రదించి సీటు పొందవచ్చని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్‌లు వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రిన్సిపల్ అన్నారు. ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మెరుగైన మౌలిక వసతులతో బోధన జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ తో పాటు 7, 8, 9 తరగతుల్లోని మిగులు సీట్లు కూడా భర్తీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

## మిస్పా చర్చి నిర్మాణానికి రూ.20 వేల ఆర్థిక సహాయం



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూలై 6: ఎమ్మిగనూరు పట్టణంలోని మిస్పా చర్చి నిర్మాణానికి బూదురు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు జక్కయ్య రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంత్రాలయం మండలం బూదురులోని జక్కయ్య స్వగృహంలో చర్చి పాస్టర్ రేవరెండ్ ఆశీర్ భూషణ్, సంఘ పెద్దలకు ఈ మొత్తాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సంఘ పెద్దలు జక్కయ్యను శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. చర్చి నిర్మాణానికి తమకు అండగా నిలిచినందుకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జక్కయ్య మాట్లాడుతూ, "సమాజంలోని అన్ని మతాల ప్రార్థనా మందిరాల నిర్మాణానికి, సేవా కార్యక్రమాలకు మా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి. చర్చి నిర్మాణం పూర్తి అయ్యే వరకు మరిన్ని విధాలుగా అండగా ఉంటాం"అని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఆనంద్, ప్రసాదు, యోహాను తదితరులు పాల్గొన్నారు.

## జాతి భేదం మరచి పాలు ఇచ్చిన వరాహం



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూలై 6: కోసిగి మండలం జంపాపురంలో అరుదైన, ఆశ్చర్యకర ఘటన చోటుచేసుకుంది. ఒక ఆడ వరాహం తన జాతి స్వభావాన్ని పక్కనపెట్టి, అనాథగా మిగిలిన కుక్క పిల్లలకు తల్లిలా పాలు ఇస్తూ లాలించింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. ఆకలితో అల్లాడుతున్న కుక్క పిల్లలను వరాహం దగ్గరకు తీసుకొని, అవి కడుపు నిండా పాలు తాగే వరకు కదలకుండా ఉండటం అందరినీ ఆకట్టుకుంది.ఈ ఘటనపై గ్రామస్థులు మాట్లాడుతూ, "మనిషిలోనే కాదు, జంతువుల్లోనూ జీవకారుణ్యం ఉంటుందని ఈ సంఘటన రుజువు చేసింది. ప్రకృతి ఎంత గొప్పదో, జీవుల మధ్య ప్రేమ ఎంత గొప్పదో ఈ సంఘటన తెలియజేస్తుంది"అని ముచ్చటించుకున్నారు. ప్రస్తుతం కుక్క పిల్లలు సురక్షితంగా ఉండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి



మంత్రాలయం, శివసూర్య, జూలై 6: మంత్రాలయం పట్టణంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సమరయోధుడు, దేశ తొలి ఉప ప్రధాని అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దేవరపాటి అనిల్ కుమార్, మారెన్న, నాగేంద్ర, గోపాల్, గాడిమోడీ నరసింహులు, ఏసేపు, గర్జి ప్రకాష్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## రచ్చమర్రిలో ఉత్సాహంగా క్రీడా పోటీలు



మంత్రాలయం,శివసూర్య,జూలై 6: మంత్రాలయం మండలం రచ్చమర్రి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ యువకుల కోసం పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పరుగు పందెంలో రామిరెడ్డి మొదటి స్థానంలో నిలవగా, లాంగ్ జంప్ పోటీలో రామకృష్ణ ప్రథమ స్థానం సాధించారు. గెలుపొందిన విజేతలకు గ్రామ పెద్దలు, యువకులు బహుమానాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం విజేతలను గ్రామంలో ఊరేగించారు. ఏరువాక సంబరాలకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంత్రాలయం సిఐ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రాలయం ఎస్సై, మల్లికార్జున,మాధవరం ఎస్సై విజయ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి వేడుకల ప్రాంగణం, ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేక గస్తీ నిర్వహించి శాంతిభద్రతలను పరిరక్షించారు. దీంతో వేడుకలు ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా ముగిశాయి.

## ఎద్దుల పండుగ గ్రామ ఐక్యతకు నిదర్శనం: ఎస్సై మారుతి



మంత్రాలయం,శివసూర్య( ప్రతినిధి)జూలై 6:పెద్దకడబూరు మండలం నెమలి కళ్ళు గ్రామంలో ఎద్దుల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెంలో బోయ జయరాముడు మొదటి స్థానంలో, రాము రెండవ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విజేతలను గ్రామ పెద్దలు, టిడిపి బూత్ కన్వీనర్ నాగేష్, పెద్దకడబూరు ఎస్సై మారుతి తదితరులు శాలువాలతో గప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మారుతి మాట్లాడుతూ, ఎద్దుల పండుగ గ్రామ ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. ఎద్దుల పండుగ మన పల్లె సంప్రదాయాలకు, వ్యవసాయ సంస్కృతికి ప్రతీక అని, ఇలాంటి వేడుకల్లో ప్రజలంతా సామరస్యంగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా టిడిపి బూత్ కన్వీనర్ నాగేష్ మాట్లాడుతూ, ఎద్దుల పండుగ మన గ్రామ సంస్కృతికి గర్వకారణమని, యువత ఇలాంటి సంప్రదాయ క్రీడలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎద్దుల పండుగ వేడుకలకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆనందంగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

## విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతున్న ఎమ్మిగనూరు నవోదయ కోచింగ్ సెంటర్ల ను సీజ్ చేయాలి ,



ఎమ్మిగనూరు,శివసూర్య, జూలై 6: ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న విక్టరీ ,గురు ,టాపర్ ,విన్నర్ , విజ్ఞాన్, ఆజాద్ ,కృష్ణవేణి, వీవీ నవోదయ కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నవోదయ కోచింగ్ సెంటర్ల ను సీజ్ చేయాలని స్పందన కార్యక్రమం లో ఖాఖీ× ఉదయ్ , విద్యార్థి సంఘం నాయకులు శేఖర్ , జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి గారికి ఫిర్యాదు చేశారు , ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తూ , విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ, పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులను తమ కోచింగ్ సెంటర్లో ఉంచుకొని, నవోదయ కోచింగ్ లు విద్యార్థులకు చెబుతూ , విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా , బాలల హక్కులను కాలరాస్తూ ,బహుళ అంతస్తుల్లో ప్రమాదాలుగా ఉండేటటువంటి బిల్డింగ్లో కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారని , నిన్న అనగా 5 -7 -2026 న గుడికల్ రోడ్డు నందు గురు నవోదయ కోచింగ్ సెంటర్లో 10 సంవత్సరాల విద్యార్థి నిశాంతు నవోదయ కోచింగ్ సెంటర్లో చెప్పేటటువంటి చదువు చదవలేక , ఇంటికి పంపించమని గురు కోచింగ్ సెంటర్ యాజమాన్యాన్ని అడిగిన పంపించకుండా తమ కోచింగ్ సెంటర్ లోనే పెట్టుకోవడంతో నిశాంత్ అనే విద్యార్థి గురు నవోదయ కోచింగ్ సెంటర్ మూడు అంతస్తుల భవనం పై నుండి నిశాంత్ అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం జరిగిందని, ఆ విద్యార్థి గాయాలు కావడంతో విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని , కావున ఈ ప్రమాదానికి కారణమైన గురు కోచింగ్ సెంటర్ యాజమాన్యం పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని, అలాగే గత నెల జూన్ 1 వ తారీకున ఎమ్మిగనూరు పట్టణంలోని విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ యాజమాన్యమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, దుబారి కాజా బాషా పైన చర్యలు తీసుకోవాలని , మరియు వివిధ నవోదయ కోచింగ్ సెంటర్ల లో ఉండే విద్యార్థులకు రక్షణ కల్పించాలని, బాలల హక్కుల కమిషన్,చైర్మన్-ూఇూ సూర్యనారాయణ ,గారికి ఫిర్యాదు చేయగా , ఈ ఫిర్యాదు పై బాలల హక్కుల కమిషన్ చైర్మన్ గారు కర్నూలు జిల్లా కలెక్టర్, మరియు ,విద్యాశాఖ కమిషనర్ , కర్నూలు జిల్లా ఎస్పీ గారికి విచారణ చేసి ఆ కోచింగ్ సెంటర్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చిన ఇప్పటికి ఏమాత్రం కూడా స్పందించడం లేదని కావున దీనిపై వెంటనే విచారణ కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మరియు,ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వివిధ కోచింగ్ సెంటర్లను సీజ్ చేసి పాఠశాలలో ఉండాల్సిన పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరుచున్నాము , ఈ కార్యక్రమంలో నవీన్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు

## వరుణయాగం నిర్వహించిన వికాస తరంగిణి అర్చక సంఘం చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూలై 6 : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని వికాస తరంగిణి శ్రీ గురు ఓంకార పీఠం, శ్రీలేఖ కిరాణా వద్ద గల స్థలదేవత తాయమ్మ అవ్వ దేవాలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వరుణయాగం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని డి.డి.ఎన్.ఎస్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహ కన్వీనర్ ఆచార్య చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో వారి బృందం వేదోక్తంగా నిర్వహించింది.ఈ సందర్భంగా ఆచార్య చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, రైతులు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు కలగాలని సంకల్పంతో ఈ వరుణయాగాన్ని ప్రతిరోజు సుందరకాండ దేవి పురాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పూర్వాభాద్ర నక్షత్రంలో శ్రీ గుంటిరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు ఆచార్య



ఐజ, శివసూర్య జూలై 6 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ఠ మాసం బహుళ షష్ఠి పూర్వాభాద్ర నక్షత్రంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ ఆంజనేయులు వీరేష్ పాండు అమర్ సరస్వతి చిన్నఆంజనేయులు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వికాస తరంగిణి ఆధ్వర్యంలో చాలీసా విష్ణు సహస్రనామం



జోగులాంబ, శివసూర్య జులై 6 . గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## కేశవరం గ్రామంలో శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణ మహోత్సవం జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జులై 6 : జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ తాలూకా, ఐజ మండలం కేశవరం గ్రామంలో డిల్లన్న నూతన గృహప్రవేశ మహోత్సవం సందర్భంగా శ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా మాలల మార్పిడి కార్యక్రమం నిర్వహించి, భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించారు. అనంతరం హరినామ సంకీర్తన నిర్వహించగా భక్తులు భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి డిల్లన్న బంధుమిత్రులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర దూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఉదయం నుంచే ప్రజల సందడితో కళకళలాడిన శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ క్యాంపు కార్యాలయం.

నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది. వారితో ఆప్యాయంగా సమావేశమైన శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ వారి సమస్యలు, సూచనలు తెలుసుకుని, అభివృద్ధి కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతంపై చర్చించారు.

## గంగానమ్మ గుడి నిర్మాణానికి 50 వేల రూపాయలు విరాళం ఇచ్చిన సురేష్ బాబు

లింగపాలెం మండలం కలరాయినిగూడెం పంచాయతీ ఈదుల చెరువు కట్టపై నిర్మిస్తున్న గంగానమ్మ గుడి నిర్మాణానికి చల్లగుళ్ల సత్యనారాయణ శకుంతల కుమారుడు చల్లగుళ్ల సురేష్ బాబు, (ఏలూరు జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు) గంగమ్మ గుడి నిర్మాణానికి 50వేల రూపాయలు గుడి కమిటీ వారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగానమ్మ గుడి కమిటీ సభ్యులు,కలరాయనగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

## విజయవాడ పటమటలో ఏకే బిర్యానీ హౌస్ ను ప్రారంభించిన తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాల లోనే సుమారు వందకు పైగా బిర్యానీ హోటల్స్ ను ప్రారంభించడం జరిగింది. విజయవాడకే ఒక ప్రతిష్టాత్మకమైన సెంటర్ ఈ పటమట సెంటర్. గుంటూరులో 2 నరసరావుపేటలో 1, విజయవాడ లో 4వ బ్రాంచ్ ప్రారంభించడం చాలా

## ఈ రోజు ఆగిరిపల్లి మండల హెడ్ క్వార్టర్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కి పూల మాల వేసి ఘనమైన నివాళ్ళు అర్పించిన ఆగిరిపల్లి మండలం వైస్సార్సీపీ నాయకులు



ఏలూరు జిల్లా ,ఆగిరిపల్లి ,జులై 6 )భారత మాజీ ఉపప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయానికి చిరునామా, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన 45 యేళ్లు వరస పార్లమెంటరేయన్ మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 49వ వర్ధంతి సందర్భంగా ఆ మహోన్నత వ్యక్తిత్వానికి ఘన నివాళులు.ఈ కార్యక్రమం లో నూజవీడు నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలు తులిమల్లి పానవ జ్యోతి సుజన కుమారి , అగిరిపల్లి మండలం ఉపాధ్యక్షులు మల్లంపల్లి రవి శేఖర్, వైస్సార్సీపీ ఎస్ సి . సెల్ నాయకులు కంబాల ప్రదీప్,ఎక్స్ వర్క్‌బోర్డు నాయకులు షేక్ సుభాని ఎంపీటీసి షేక్ నాగుల్న?మీరా,ఆగిరిపల్లి టౌన్ ప్రెసిడెంట్ చిమట శ్రీనివాసరావు తదితరులు పాల్గోని ఘనమైన నివాళులు అర్పించారు.

## : ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత





తుగ్గలి: జూలై 06. ( ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఎస్‌సీ సోదరుడు రెడ్డిపోగుల శవాసికి సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శ్రీ కె.ఈ. శ్యామ్ కుమార్ , రాష్ట్ర ట్రైబల్ అడ్వైజర్ వెంకటపతి చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో టీడీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమే టీడీపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెదేపా యువ నాయకులు రాజేంద్ర గౌడ్, మస్తాన్ పాల్గొని లబ్ధిదారునికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో నిరంతరం ముందుంటూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

## తుగ్గలిలో ప్రపంచ జూనాసిస్ డే సందర్భంగా ఉచిత యాంటీ రాబీస్ టీకాల కార్యక్రమం




తుగ్గలి: జులై 06. )ప్రపంచ జూనాసిస్ డే సందర్భంగా జూలై 6న తుగ్గలి పశు వైద్యశాలలో ఉచిత యాంటీ రాబీస్ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.పశు వైద్యాధికారి డా. బాలకృష్ణ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. రాబీస్ వ్యాధి ప్రమాదకరమైనదని, ప్రతి కుక్కకు తప్పనిసరిగా టీకా వేయించాలని ఆయన సూచించారు.కుక్క కాటు వల్ల వచ్చే రాబీస్ వ్యాధి ప్రాణాంతకమని, దీని నివారణకు టీకా ఒక్కటే మార్గమని పశు వైద్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ పెంపుడు కుక్కలను తీసుకొని రావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు కుక్క యజమానులు పాల్గొని తమ పెంపుడు కుక్కలకు టీకాలు వేయించారు. ఇలాంటి ఉచిత టీకా క్యాంపులు ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## తుగ్గలిలో కదిలించిన ఆర్.టి.ఐ కథనం స్పందించిన పంచాయతీ అధికారులు



తుగ్గలి: జులై 06. )తుగ్గలిలో పారిశుధ్య లోపంపై ఆర్టిఐ ఎక్స్ప్రెస్ న్యూస్ లో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు




స్పందించారు.పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ రామకృష్ణ, ఆదేశాల మేరకు సిబ్బంది గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. డ్రైనేజీలు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లారు.పలు వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్లపై నిలిచి ఉన్న మురుగునీటిని తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.సమస్యపై స్పందించిన పంచాయతీ అధికారులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని, పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## అప్పు తిరిగి అడిగితే బెదిరింపులు.. ఎస్పీని ఆశ్రయించిన బాధితులు




పెనుకొండ: మహిళా సంఘాల పేరుతో వ్యక్తిగతంగా తీసుకున్న రూ.3.17 లక్షల అప్పును తిరిగి చెల్లించకుండా, పైగా బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ బాధితురాలు ఎస్. బీబీజాన్ సత్యసాయి జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను సోమవారం ఆశ్రయించారు.బాధితురాలు బీబీజాన్ మాట్లాడుతూ సుమారు ఆరు నెలల క్రితం పెనుకొండకు చెందిన కుమ్మరదొడ్డి రేష్మాబాను రూ.3,17,000 అప్పు తీసుకున్నారని తెలిపారు. పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా,రేష్మాబాను తన తమ్ముళ్లు బుజ్జి, సనావుల్లాలను తమపైకి ఉసిగొల్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఈ విషయమై ఇప్పటికే స్థానిక పెనుకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని బాధితురాలు వాపోయారు.దీంతో జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.రేష్మాబాను వద్ద నుంచి తమకు రావాల్సిన అప్పు మొత్తాన్ని ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే తమను బెదిరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని బాధితురాలు ఎస్పీని కోరారు.

## వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి- కొయ్యూరు వైఎస్సార్‌సీపీ పిలుపు.



కొయ్యూరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను జూలై 8న కొయ్యూరు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిడిజన అప్పారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి సీతారామరాజు జిల్లా పార్టీ ఇన్‌చార్జి మత్స్యరాస విశ్వేశ్వర రాజు సూచనలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండలంలోని అన్ని వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన కార్యక్రమం నల్లగొండలోని వైఎస్సార్ విగ్రహం వద్ద జూలై 8న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు, క్రియాశీల కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిడిజన అప్పారావు విజ్ఞప్తి చేశారు.

## సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉద్యోగులకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పదోన్నతి పత్రాలను జడ్పీ చైర్మన్ అందజేశారు .



ఏలూరు జిల్లా ,ఏలూరు )ఏలూరు, : స్థానిక జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా పరిషత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉద్యోగులకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా (ఏవో ) పదోన్నతి పత్రాలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పదోన్నతి పొందిన అధికారులకు అభినందలు తెలుపుతూ, వారి సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు కృషికి తగిన గుర్తింపు లభించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. పదోన్నతి పొందిన వారిలో జి.సుధారాణి పదోన్నతి ఎన్నో రోజులుగా పెండింగులో ఉండగా, దీనిపై ప్రత్యేక చొరవ తీసుకుని పదోన్నతి ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నందుకు చైర్ పర్సన్ కు కృతజ్ఞతలు తెలిపారు. దృష్టి లోపం ఉన్న ఉద్యోగిగా జి.సుధారాణి న్యాయం జరిగేలా సహకరించి నందుకు బ్లైండు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ ను కలిసి ప్రత్యేకంగా అభినందిస్తూ తమ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ఆచంట జడ్పీటీసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, జంగారెడ్డిగూడెం జడ్పీటీసి సభ్యులు పోల్నాటి శ్రీనివాసు, పదోన్నతి పొందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి:ఏపీటీఎఫ్ 1938 బ్రహ్మసముద్రం మండల శాఖ డిమాండ్

కళ్యాణదుర్గంగోవిందు జులై 6కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలంలోని



ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి శ్రీ ఓబులపతి కి వినతి పత్రం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కే. మహేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా అన్ని ఖాళీలను చూపించాలని, ఎం.టీ.ఎస్ టీచర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలని, శ్రీవం కిట్లను త్వరగా పాఠశాలకు చేరవేసి విద్యార్థులకు అందేలా చూడాలని ఎం.ఈ.ఓ కి విన్నవించడం జరిగింది. అలానే మండలంలో పనిచేయుచున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు వృత్తిపర సేవల పట్ల ముందు వరసలో ఉంటూ వృత్తిపర సమస్యల పరిష్కారం చేయడంలో రాజీ లేని పోరాటం చేస్తూ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వై.సంగప్ప, ప్రధాన కార్యదర్శి వై.సోమశేఖర్, అసోసియేట్ అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, అసోసియేట్ కార్యదర్శి అన్వర్, సీనియర్ నాయకులు బి. చెన్నకేశవులు, జగదీష్ కుమార్, ఫణీంద్ర ,సురేష్ కుమార్, ప్రవీణ్, కార్తీక్,గోవిందరాజులు,గోవిందప్ప ,నవీన్ కుమార్, కుళ్లాయమ్మ,ప్రశాంతి, వనచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దొంగ పిండి గ్రామంలో రూ 24 లక్షలతో తాత్కాలిక వంతెన మార్గం దొంగపిండి గ్రామంలో కుంగిపోయిన వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే అంజి బాబు గారు



భీమవరం జూన్ 6 ప్రతినిధి నాగేశ్వరరావు భీమవరం మండలం దొంగపండి గ్రామంలో ఈటీవల్లే కుంగిపోయిన వంతెన రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అంజిబాబు పరిశీలించారు ఈ మార్గానికి ఈ వంతెన ఎంతో అవసరమైన ఈ వంతెన పూర్తిగా దెబ్బతింది అని త్వరలో కొత్త వంతెన వెయ్యి ఇస్తామని అన్నారు ప్రస్తుతం ఆ ప్రాంతానికి వెళ్లే ప్రజలకు ఇబ్బందులు అసౌకర్యం లేకుండా రూ 24 లక్షలతో తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేశామని అన్నారు గ్రామాలకు వెళ్లే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు

## మలుగూరులో 2,000 ఎకరాల భూసేకరణ పనులు వేగవంతం

**పారిశ్రామిక వాడ స్థాపనకు ప్రభుత్వం చర్యలు -- ఎకరాకు రూ.12.75 లక్షల పరిహారం**

హిందూపురం, జులై 6(హిందూపురం మండలంలోని మలుగూరు గ్రామ పరిధిలో ప్రతిపాదిత



పారిశ్రామిక వాడ (ఇండస్ట్రియల్ పార్క్)స్థాపన కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది.సుమారు 2,000 ఎకరాల భూమిని సేకరించే కార్యక్రమంలో భాగంగా హిందూపురం తహసీల్దార్ వెంకటేశు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిర్వహించారు.భూసేకరణకు సంబంధించి రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.12.75 లక్షల పరిహారం అందజేస్తోందని అధికారులు తెలిపారు. భూసర్వే, భూ యజమానుల వివరాల సేకరణ, సంబంధిత రికార్డుల పరిశీలన వంటి ప్రక్రియలను వేగంగా పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ అమరేంద్రతో పాటు రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొని భూసేకరణ పనులను పర్యవేక్షించారు.పారిశ్రామిక వాడ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతంలో పరిశ్రమలు నెలకొని ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## పోలవరంలో ఘనంగా బాబు జాగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు..

**బాబు జాగ్జీవన్ రామ్ కి నివాళులర్పించిన పలువురు నేతలు..**



పోలవరం జూలై 6స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జాగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ నాయకులు, మాల మహానాడు నాయకులు ఆధ్వర్యంలో పోలవరం మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మార్పీఎస్ ప్రెసిడెంట్ ఉంద్రాజవరపు వెంకట రమణ మూర్తి,మాలమహానాడు రాష్ట్ర సెక్రెటరీ సోబ్బన మోహన్, టిడిపి పోలవరం నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పిల్లి నాగరాజు, టిడిపి నాయకులు కొండే ఏసు పాల్గొని పోలవరం పంచాయతీ ఎదురుగా ఉన్న స్వర్గీయ బాబు జాగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోబ్బన మోహన్,ఉంద్రాజవరపు వెంకట రమణ మూర్తి లుమాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, భారత దేశ మొట్టమొదటి దళిత ఉప ప్రధానిగా, 40 ఏళ్ల పాటు మంత్రిగా పనిచేసి దేశంలో అసమానతలు తొలగొంచి రూపుమాపెందుకు విశేషంగా కృషి చేసిన బాబు జాగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. ఆయన సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని తెలిపారు. యువత ఆయన ఆదర్శాలను అనుసరించి సమాజ సేవలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర సెక్రెటరీ సోబ్బన మోహన్, పోలవరం ఎమ్మార్పీఎస్ ప్రెసిడెంట్ ఉంద్రాజవరపు వెంకట రమణ మూర్తి,టిడిపి పోలవరం నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పిల్లి నాగరాజు, టిడిపి నాయకులు కొండే ఏసు,గంగాధర్,సోమరాజు,పోసిబాబుతదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసిన శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి..

**స్పోర్ట్స్ స్కూల్‌కు నిధుల మంజూరు చేయాలని వినతి..**

**పోలవరంలో ఐసీడీఎస్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని విజ్ఞప్తి..**



పోలవరం జూలై 6 (అమరావతి సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలకు సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు.. అరకు నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్‌కు నిధుల మంజూరు చేయాలని వినతి అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు నియోజకవర్గం, డుంబ్రిగూడ మండలం అంజోడ గ్రామంలో గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయడం జరిగింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వెనక్కి తీసుకోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ స్పోర్ట్స్ స్కూల్ ద్వారా ఎంతో మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన విషయం ప్రస్తావిస్తూ, గిరిజన యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ స్కూల్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసి, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేయాలని మంత్రి ని కోరారు..

**పోలవరం మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని విజ్ఞప్తి..**



పోలవరం మండలంలో 1975లో ప్రారంభమైన ఐసీడీఎస్ ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం 2023 జూన్‌లో కొయ్యలగూడెం మండలంలో విలీనం చేసింది. ప్రస్తుతం కొయ్యలగూడెం మండలంలో 79 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, పోలవరం మండలంలో 89 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంతేకాకుండా పోలవరం పూర్తిగా ఏజెన్సీ మండలం కావడంతో అక్కడే ప్రాజెక్టు నిర్వహించడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. పోలవరం మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన భవనం, పూర్తి మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నందున, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొయ్యలగూడెం నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టును తిరిగి పోలవరం మండలానికి మార్చి, గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. తదితర శాలపై మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..ఈ భేటీలో రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ నాయక్ పాల్గొన్నారు..

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.